క్లుప్తంగా

ఎల్లారెడ్డి ఎన్నికల పరిశీలకుడిగా జగదీష



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా జగదీషాను ఎన్నికల కమిషన్ నియమించినట్లు రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జగదీషా, పరిశీలకుడిగా వ్యవహరిస్తారని అన్నారు. ఏవైనా ఫిర్యాదులుంటే నెంబర్ 8143779448కు ఫోన్ చేయవచ్చని అన్నారు.

కామారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ పరిశీలకుడిగా రఫియోద్దీన్



లింగంపేట(ఎల్లారెడ్డి): కామారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా రఫియోద్దీన్‌ను నియమిస్తూ ఏఐసీసీ మైనార్టీ విభాగం జాతీయ అధ్యక్షుడు ఇమ్రాన్ గురువారం నియామాక ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో 119 అసెంబ్లీ స్థానాలకు మైనార్టీ విభాగం నుంచి పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. లింగంపేట మండల కేంద్రానికి చెందిన రఫియోద్దీన్‌కు ఏఐసీసీ నుంచి నియామాక పత్రం అందినట్లు తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీ పనితీరు రోజు రోజు సమాచారాన్ని అధిష్టానానికి అందజేయనున్నామన్నారు.

రేవంత్‌రెడ్డి సభకు 20 వేల మంది తరలింపు



భిక్కనూరు: కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న సభకు భిక్కనూరు మండలం నుంచి 20 వేల మందిని తరలిస్తున్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి, తదితరులు మాట్లాడుతూ.. అన్ని గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా రేవంత్‌రెడ్డి సభకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నేతలు లింబాద్రి, దయాకర్ రెడ్డి, సిద్ధాగౌడ్, దుంపల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిన జమునా రాథోడ్



ఎల్లారెడ్డి: వైఎస్ఆర్‌టీపీకి చెందిన జమునా రాథోడ్ పార్టీకి రాజీనామా చేసి బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)లోకి చేరినట్లు పార్టీ నాయకులు గురువారం తెలిపారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో జమునా రాథోడ్ పార్టీలో చేరారు. ఇటీవలే ఆమె నామినేషన్ కూడా వేశారు. వెంకట్ రాథోడ్ ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీలపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఎన్నికల నిబంధనలు పాటించని కాంగ్రెస్, బీజేపీలపై ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ గురువారం తెలిపారు. నామినేషన్‌లో భాగంగా కాంగ్రెస్, బీజేపీకి చెందిన అభ్యర్థులు అధికంగా జనాలతో ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించడం, డీజే, టపాకాయలు కాల్చడం వంటివి చేయడంతో అధికారుల ఫిర్యాదు మేరకు నాయకులపై కేసు నమోదైనట్లు ఎస్సై వివరించారు.

ఘనంగా నేషనల్ లీగల్ సర్వీసెస్ డే



కామారెడ్డి టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు అవరణలో గురువారం నేషనల్ లీగల్ సర్వీసెస్ డే వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, జ్యుడిషియల్ న్యాయమూర్తి హారిక, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: ఎల్ఐసీ కామారెడ్డి శాఖ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా పి.సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ నయిమోద్దీన్, కార్యదర్శిగా కె.అనిల్‌కుమార్, కోశాధికారిగా పి.వెంకటేష్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.రమేష్, కె.నర్సింలు, కార్యవర్గసభ్యులుగా సయ్యద్, దామోదర్, అమర్‌నాథ్‌లు ఎన్నికయ్యారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- రెండు రోజుల్లో 20 మందిని గాయపర్చిన శునకాలు
- కుక్కల బెడద నివారించాలని కోరుతున్న స్థానికులు





గాయపడిన వసంత్, తొడకు గాయాలైన యువకుడు



ఎల్లారెడ్డిలో సంచరిస్తున్న కుక్కల మంద

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో రెండు రోజుల వ్యవధిలో 20 మందికి పైగా కుక్కల దాడిలో గాయాల బారిన పడ్డారని స్థానికులు చెబుతున్నారు. కుక్కల కోసం సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటిని సంరక్షణ కేంద్రాలకు తరలించాలని కోరుతున్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో పిచ్చి కుక్క కరిచి 10 మందికి పైగా తీవ్ర గాయాల పాలయ్యారని స్థానికులు తెలిపారు. పట్టణంలో సేకరించిన చెత్త మొత్తం డంపింగ్ యార్డుకు తరలించకుండా మోడల్ స్కూల్ పరిసరాల్లో పడేయడం, చికెన్ వ్యర్థాలను కూడా అక్కడే పడేయడంతో కుక్కలు చేరి అటుగా పోయే వాళ్లను వెంబడించి కరుస్తున్నాయి. అధికారులు త్వరగా చర్యలు తీసుకుని కుక్కల బెడద నుంచి సామాన్యులను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మాంసం బయటకు వచ్చింది

ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ బైపాస్ వద్ద బస్ కోసం ఎదురు చూస్తున్న సమయంలో కుక్కల మంద వచ్చి చేతికి, తొడ భాగంలో కొరకడంతో మాంసం బయటకు వచ్చింది. అక్కడ ఉన్న పోలీసులు కుక్కల మందను తరిమి వేయడంతో ప్రాణాపాయం తప్పింది.

– వసంత్, ఎల్లారెడ్డి

గుంపుగా దాడి చేశాయి

ఎల్లారెడ్డి పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీలో వెళ్తున్న సమయంలో కుక్కలు దాడి చేసి తొడ భాగంలో గాయపరిచాయి. అధికారులు కుక్కల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి జనాలను కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలి.

– సాయిలు, ఎల్లారెడ్డి

మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, కుక్కల బెడదను నివారించాలని కోరుతూ స్థానికులు గురువారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌కు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో చాలా మందిని కుక్కలు కరిచాయని, బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉందని, ఇటీవల 20 మందికి పైగా కుక్కలు కరిచాయని ఫిర్యాదు చేశారు. త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే జాజాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ అన్నారు. గురువారం జాజాల సమక్షంలో రుద్రారం గ్రామానికి చెందిన 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగి ఇతర పార్టీలకు ఓటు వేస్తే రాష్ట్రం కరెంటు లేక అంధకారమవుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాయకులు జలంధర్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు. అలాగే లింగారెడ్డిపేట, భిక్కనూర్ తదితర గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

స్థానికంగా ఉండి సేవ చేస్తా..

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుత ఎన్నికలు ఆత్మగౌరవం, ధర్మ–అధర్మం, నీతి–నిజాయితీలకు మధ్య జరుగుతున్న ఎన్నికలని, ధర్మమే గెలుస్తుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గురువారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని స్థానిక జీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఎల్లారెడ్డి ప్రజలు అంటే చులకనగా చూస్తున్నారని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా ఆలోచన చేసి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులకు తమ నాయకులు, కార్యకర్తలపై నమ్మకం లేకుండా పోయిందన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు లేరా అని ప్రశ్నించారు. వాళ్లను కాదని జీతాలు ఇచ్చి నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, కడప, రాయలసీమ నుంచి యువకులను తెచ్చి నియోజకవర్గంలో ప్రచారం చేయిస్తున్నారని ఎద్దేవా చేశారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

ఈ నెల 15వ తేదీన ఎల్లారెడ్డి పట్టణంలో సీఎం కేసీఆర్ సభను 70 వేల మందితో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇందుకోసం సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, మాజీ ఎంపీపీ వడ్ల భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

భారీగా చేరికలు

ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో వందలాది మంది చేరారు. లింగంపేటకు చెందిన జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మూన్యానాయక్, మాజీ ఎంపీపీ వడ్ల భీమయ్య, లింగంపేట మాజీ సర్పంచ్ బాలమణి, లింగంపల్లి ఎంపీటీసీ బాగవ్వ చేరారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లే



ఎల్లారెడ్డిలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసినట్లేనని ఎల్లారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయం నుంచి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా మీదుగా మున్సిఫ్ కోర్టు వరకు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం భార్య విద్యారాణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకులు దేవేందర్, అఫీజ్‌లతో కలిసి నామినేషన్ వేశారు. అనంతరం సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్‌కు ఎల్లారెడ్డి ప్రజలు ఓటు వేసి వేసి గెలిపిస్తే బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడు పోవడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్ఎస్‌కు వేసినట్లేనని అన్నారు. గతంలో సైతం ఎమ్మెల్యే సురేందర్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి బీఆర్ఎస్‌కు అమ్ముడు పోయాడని ఆరోపించారు. కాబట్టి ప్రజలు బీజేపీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. నాయకులు బాపురెడ్డి, రాంరెడ్డి, బైండ్ల పోచయ్య, తదితరులున్నారు.

ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు

- బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి హన్మంత్‌సింధే



నిజాంసాగర్(జుక్కల్): ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని జుక్కల్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే సూచించారు. గురువారం జుక్కల్ మండలం కేంరాజ్ కల్లాలి, మహమ్మదాబాద్, చిన్నగుల్ల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతిపక్ష పార్టీల పాలనలో జుక్కల్ వెనుకబాటుకు గురైందని చెప్పారు. మరోమారు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు నీలుపటేల్, సాయాగౌడ్, శివానంద్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే ప్రచారం అడ్డగింత



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం మహమ్మదాబాద్‌లో గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే ఎన్నికల ప్రచారాన్ని స్థానిక యువకులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని, దళిత బంధు ఒక్కరికి రాలేదని బీఆర్ఎస్ ప్రచార రథాన్ని అడ్డగించారు. బీఆర్ఎస్ నేతలు జోక్యం చేసుకొని యువకులు, గ్రామస్తులను సముదాయించారు.

గణిత ఒలింపియాడ్ పరీక్షలు



కామారెడ్డి రూరల్: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం గణిత ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి పోటీ పరీక్షల భయాన్ని పోగొట్టాలనే సదుద్దేశంతో 18 ఏళ్లుగా ప్రతి ఏటా ఒలింపియాడ్ పరీక్షలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తుమ్మ అమరేష్ తెలిపారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు రామకృష్ణ, గణిత ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజంపేట: నేడు(శుక్రవారం) మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని మండల ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్పీకర్‌కు భారీ మెజార్టీ ఖాయం



బాన్సువాడలో మాట్లాడుతున్న అంజిరెడ్డి, పక్కన డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



సదాశివనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ: వచ్చే ఎన్నికల్లో బాన్సువాడలో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. గురువారం స్వతంత్ర అభ్యర్థిగా పోచారం భాస్కర్ రెడ్డి నామినేషన్ వేశారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో బాన్సువాడలో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ గెలవడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్,బీజేపీలకు అభ్యర్థులు లేక స్థానికేతరులకు టికెట్లు ఇచ్చే పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. పోచారం భాస్కర్‌రెడ్డి డమ్మీ నామినేషన్ వేశారని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. గురువారం పట్టణంలోని చైతన్య కాలనీ, శాంతినగర్, టీచర్స్ కాలనీలో ఆయన ప్రచారం నిర్వహించారు. బీర్కూర్ మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.

ప్రజాసేవ చేసే వారినే గెలిపించుకుందాం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేసే వారికే ఓటు వేసి గెలిపించుకుందామని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెర్కశ్రీనివాస్ అన్నారు. గురువారం రాములగుట్టలో గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. సర్పంచ్ గోపి, ఎంపీపీ పాల్త్య విఠల్, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్ బాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

తాడ్వాయి/సదాశివనగర్(ఎల్లారెడ్డి): తాడ్వాయి, సదాశివనగర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాలలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇంటింటికి తిరుగుతూ మేనిఫెస్టోను వివరించారు.

'ప్రజల మనిషిని గెలిపించుకుందాం'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్

లింగంపేట(ఎల్లారెడ్డి): అందుబాటులో ఉండే ప్రజల మనిషి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను రెండో సారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జీఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు లేక ఇతర జిల్లాల నుంచి తెచ్చుకొని పోటీ చేయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. మదన్‌మోహన్‌రావు గెలిస్తే అమెరికా, ఢిల్లీ, హైదరాబాదు అంటూ తిరుగుతాడు తప్ప అభివృద్ధి ఉండదన్నారు.

బాన్సువాడలో బీజేపీ జెండా ఎగరేయాలి



నస్రుల్లాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ నేతలు



సోమ్లానాయక్ తండాలో ప్రచారం చేస్తున్న సుగుణ

- బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బాన్సువాడ నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్త అహర్నిశలు పని చేయాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, అందుకు గాను ప్రతి కార్యకర్త ఈ 20 రోజులు ప్రజల్లోనే ఉండాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, ప్రధాన కార్యదర్శి మేకల రాములు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పథకాలే బీజేపీని గెలిపిస్తాయి

బాన్సువాడ రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిస్తాయని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుగ్లోత్ సుగుణ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని గోపాల్‌తండా, సోమ్లానాయక్ తండా, వెంకటేశ్వర తండాల్లో గురువారం ఆమె బీజేపీ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు హన్మాండ్లు, సాయిబాబ, పుష్పలత, సురేష్, జమున తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ చూసి గుబులు పట్టుకుంది

- జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంత రావు



బిచ్కుందలో మాట్లాడుతున్న లక్ష్మీకాంత రావు

బిచ్కుంద(జుక్కల్): జుక్కల్ నియోకవర్గంలో కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణ చూసి బీఆర్ఎస్ నాయకులకు గుండెల్లో గుబులు పుట్టిందని జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీ కాంతరావు అన్నారు. గురువారం బిచ్కుందలో ఆయన మాట్లాడారు. శుక్రవారం కాంగ్రెస్ బీఫాంతో నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. తాను నాన్‌లోకల్ అంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, సిరిసిల్లలో కేటీఆర్ నాన్‌లోకల్ కాదా.. వారు ఎలా స్థానికులు అయ్యారో ప్రజలకు చెప్పాలని కోరారు. లక్ష్మికాంతరావు బీసీ వర్గానికి చెందిన వాడని తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి బ్లాక్ మెయిల్ చేసే ప్రయత్నాలు చేశారని.. వారి ఆటలు సాగనివ్వనని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గంగారాం సలహాలు, సూచనలు తీసుకొని కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తానని అన్నారు. మాజీ జెడ్పీటీసీ, కమల్ కిషోర్, మల్లికార్జునప్ప శెట్కార్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటా..

పిట్లం(జుక్కల్): కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోట లక్ష్మీకాంత రావు పేర్కొన్నారు. చిన్నకొడప్‌గల్ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది పార్టీలో చేరారు. వారికి తోట లక్ష్మీకాంత రావు, కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం తోట లక్ష్మీకాంత్‌రావ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, జొన్న మోహన్‌రెడ్డి, బోడ్డరాజు పాల్గొన్నారు.

'కేసీఆర్‌కు బీసీలంటే చిన్నచూపు'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్

దోమకొండ: సీఎం కేసీఆర్‌కు బీసీలంటే చిన్న చూపని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి ఈరవత్రి అనిల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో దోమకొండ, బీబీపేట మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కామారెడ్డిలో శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మీటింగ్ సందర్భంగా బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తామన్నారు. దీనికి కర్ణాటక సీఎం సిద్దరామయ్య హాజరవుతారని వివరించారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నేతలు అబ్రబోయిన స్వామి, అనంతరెడ్డి, సుతారి రమేష్, తదితరులున్నారు.

ప్రలోభాలకు లొంగి ఓటు వేయొద్దు



ఓట్ ఫర్ బెటర్ ఇండియా చిత్రం ద్వారా అవగాహన కల్పించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు



అవగాహన కల్పిస్తున్న డీఈవో రాజు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రలోభాలకు లొంగి ఓటును దుర్వినియోగం చేసుకోవద్దని మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ శశిశంకర్ ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారం మోడల్ స్కూల్‌లో ఓట్ ఫర్ బెటర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రలోభాలకు లొంగి ఓటు వేస్తే అభివృద్ధి జరగదన్నారు. ఈ విషయమై విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించాలని అన్నారు.

ఎథికల్ ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎథికల్ ఓటింగ్‌పై విద్యార్థులకు డీఈవో రాజు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులున్నారు.

తొలిమెట్టును విజయవంతం చేయాలి

బాన్సువాడ రూరల్: విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు విజయవంతం చేయాలని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గంగాధర్ అన్నారు. గురువారం కళాశాలలో వాలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ల సూచనలు పాటిస్తూ సమీప పాఠశాలల్లోని విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పించాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ గులాం ముస్తఫా, అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలు అందించాలి



కామారెడ్డి టౌన్: బ్యాంకు ఖాతాదారులకు ఉత్తమ సేవలను అందించాలని ఐడీబీఐ హైదరాబాద్ జోనల్ హెడ్ సీజీఎం శరత్ కామత్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ జోనల్ పరిధిలో కామారెడ్డిలో 101 బ్రాంచ్ ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. డిప్యూటీ జోనల్ హెడ్ వాసుదేవన్, బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్, రిజినల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ హసిం, ఆర్కే కళాశాల కరెస్పాండెంట్ జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.